క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్యోతి

దోమకొండ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమ నిర్మాణాలను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటి నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను గుర్తించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ నాంపల్లి తదితరులున్నారు.

'పది'లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: మండలంలోని నాగారం గ్రామంలో మంగళవారం పదోతరగతిలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈకార్యక్రమం చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మోహన్, గంగాధర్, శ్రవణ్, సంజీవ్‌కుమార్, విఠల్, లక్ష్మణ్, రాజు, హన్మాండ్లు శివ పాల్గొన్నారు.

పల్లె దవాఖానా పరిశీలన



పరిశీలిస్తున్న ఎక్స్‌టర్నల్ వైద్యుల బృందం

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామంలో గల పల్లె దవాఖానాను ఎక్స్‌టర్నల్ వైద్యుల బృందం మంగళవారం పరిశీలించారు. డీపీవో పద్మజ, జహీరాలు ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, ఇమ్యునైజేషన్ గదులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు త్వరలోనే కాయకల్ప వైద్యుల బృందం ఆస్పత్రిని పరిశీలిస్తామన్నారు. ఆస్పత్రిలో గల లోటుపాట్లను వైద్యులకు వివరించమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, వైద్యులు శివకృష్ణ తదితరులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గురుపూజ చేస్తున్న యోగా గురువు

భిక్కనూరు: యోగా చేయడంతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సిద్దసమాధి యోగా గురూజీ మురళీధర్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో యోగా తరగతుల నిర్వహణలో భాగంగా గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన సాధకులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు మన రుషులు చూపించిన యోగా మార్గంలో ముందుకు సాగాలన్నారు. ఎస్ఎస్‌వై యోగా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా అర్హులను ఎంపికచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని మండలంలోని వదల్‌పర్తి గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో గుడిసెలలో ఉన్నవారికి, పూర్తిగా ఇల్లులేని నిరుపేదలకు మొదటిప్రాధాన్యత ఇచ్చి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపడతామన్నారు. అభ్యంతరాలపై తాము మరోసారి పరిశీలన చేస్తామని ఆయన వివరించారు.

సత్తా చాటుతున్న మోడల్ విద్యార్థులు

- ఆదర్శంగా నిలుస్తున్న కొత్తాబాది మోడల్ పాఠశాల, కళాశాల
- ఇంటర్, ఎస్సెస్సీ ఫలితాల్లో మండల టాపర్‌లుగా నిలిచిన స్టూడెంట్స్



కొత్తాబాదిలోని మోడల్ స్కూల్

బాన్సువాడ రూరల్: పిల్లల బంగారు భవిష్యత్తే కోసం తల్లిదండ్రులు నిరంతరం శ్రమిస్తుంటారు. రోజురోజుకూ ఆంగ్ల మాధ్యమానికి ఆదరణ పెరుగుతుండటంతో ఆ దిశగా చదివించాలని ఆశపడుతుంటారు. కార్పొరేట్ సంస్థల్లో చదివించేంత ఆర్థిక స్తోమతలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు చక్కటి వేదికగా నిలుస్తోంది కొత్తాబాదిలోని మోడల్ పాఠశాల, కళాశాల. ఈపాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందడమే కాదు ఆ దిశగా విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాల్లో టాప్..

ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ , ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. పదోతరగతిలో 97మందికి గానూ 96మంది విద్యార్థులు పాసవ్వడమే కాకుండా బసిరెడ్డి గాయత్రి 600మార్కులకు గానూ 576మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. సుమారు 31 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ 90మంది విద్యార్థులకు గానూ 68మంది, సెకండియర్‌లో 106మందికి గానూ 77మంది పాసయ్యారు. బైపీసీలో గిరిజన పేదవిద్యార్థిని అంగోత్ జ్యోతి 1000మార్కులను గానూ ఏకంగా 992 మార్కులు సాధించింది. ఎంపీసీలో నేనావత్ మీనాక్షి 957మార్కులు, సీఈసీలో ఎం.జ్యోతి 950 మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో గుజేతి శివాణి 457, బైపీసీలో హజారే శ్రావణి 425, సీఈసీలో గెలోత్ మాచాల 405 మార్కులు సాధించారు.

కల్పిస్తున్న వసతులు..

బాన్సువాడ మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్, కళాశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, ఉచిత పుస్తకాలు, డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ ల్యాబ్,గ్రంథాలయం, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఎంసెట్, నీట్,ఐఐటీ తదితర శిక్షణ కల్పిస్తున్నారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం



పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అందించిన సహకారంతో ఎస్సెస్సీలో 600మార్కులను గానూ 576మార్కులు సాధించాను. ఐఏఎస్ ఆఫీసర్ కావడమే నాలక్ష్యం. ఆదిశగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా కష్టపడతా. తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేరుస్తాను.

– బసిరెడ్డి గాయత్రి, విద్యార్థిని

ఎయిమ్స్‌లో సీటు సాధిస్తా



బాన్సువాడ మండలంలోని మారుమూల గ్రామం కృష్ణానగర్ తండా మాది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో ఇంటర్ బైపీసీలో 992 మార్కులు సాధించాను. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించి పేదలకు వైద్యసేవలందిచాని లక్ష్యంగా పెట్టుకున్నా.

– అంగోత్ జ్యోతి, విద్యార్థిని

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం



మాపాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాల, కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కమల్‌కిషోర్, ప్రిన్సిపల్, కొత్తాబాది మోడల్‌స్కూల్

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



బీబీపేటలో ప్రారంభిస్తున్న ఎంఈవో అశోక్



భిక్కనూరులో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బీబీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం మండల విద్యాధికారి అశోక్ ప్రారంభించారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఇండోర్ గేమ్స్, చెస్, క్యారమ్స్, చిత్రలేఖనం, కంప్యూటర్స్‌లో పెయింట్ నేర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే 15 రోజులపాటు ఉదయం 8 నుంచి 11:00 వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 6 నుంచి 9 తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం రవీంద్రారెడ్డి సూచించారు. కార్యక్రమంలో టీచర్లు అరుందతి, సంధ్య, రాజేష్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌నకు విశేష స్పందన

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంప్‌నకు విశేష స్పందన వస్తోంది. విద్యార్థులు ఉదయం పూట పాఠశాల ప్రాంగణానికి వచ్చి కరాటే, యోగా మెడిటేషన్‌లలో శిక్షణ పొందుతున్నారు. వీరికి శ్రీకాంత్ శిక్షణ ఇస్తున్నాడు. మంగళవారం ఎంఈవో రాజగంగారెడ్డి ఈక్యాంప్‌ను సందర్శించారు.

గాంధారిలో..

గాంధారి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీహరి సూచించారు. గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులు కుడుతున్న ఏకరూప దుస్తుల పనితీరును పరిశీలించారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

బాన్సువాడ : ఈ నెల 20న తలపెట్టిన సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుకు మున్సిపల్ కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. నోటీసు అందజేసిన వారిలో కార్మికులు సాయిలు, వెంకట్, శివరాజులు, బిట్ల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



ఎల్లారెడ్డిలో సీడీపీవోకు..

ఎల్లారెడ్డి: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీడీపీవో స్వరూపకు అంగన్‌వాడీ టీచర్లు సమ్మె నోటీసు ఇచ్చారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, కార్మిక చట్టాల పరిధిలోకి అంగన్‌వాడీ సిబ్బందిని తీసుకురావాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సమ్మె నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవకర్ణ, సావిత్రి తదితరులున్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



కామారెడ్డిలో మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డి టౌన్: ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి సమ్మె నోటీసులు అందజేసిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. బాలరాజ్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జేఏసి నాయకులు రాజనర్సు, దశరత్, అయాజ్, నర్సింగరావు, రాజు, సాయి, రూపేష్, అంబిక, శిరీష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాందాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బీబీపేట: మండలంలోని మాందాపూర్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేస్తున్నట్లుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, జిల్లా నాయకులు భూమాగౌడ్, మండల యువజన అధ్యక్షుడు మహేష్ కుమార్, మాందాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాకేష్ రెడ్డి, రోడ్డరాజు, శ్రీనివాస్ గౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డి ఆరో వార్డులో ...

ఎల్లారెడ్డిరూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆరో వార్డులో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సీసీ రోడ్డును మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుజిత్, సురేందర్, చర్చి ఫాదర్ ప్రభాకర్ తదితరులున్నారు.

సీఎం కప్ పతకం గెలిచిన క్రీడాకారులకు సన్మానం



దోమకొండ: మండలకేంద్రానికి సింధూజ గతేడాది సీఎం కప్ ఆర్చరీ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 2న పతకాలు అందించారు. మంగళవారం సింధూజను మాజీ తెలంగాణ ఆర్చరీ ప్రెసిడెంట్ కామినేని అనిల్, కామారెడ్డి జిల్లా ఆర్చరీ ప్రెసిడెంట్ తీగల తిరుమల గౌడ్, కార్యదర్శి కదిరే మోహన్‌రెడ్డి, ఆర్చరీ కోచ్ ప్రతాప్ దాస్, సలహాదారులు పున్న లక్ష్మణ్ తదితరులు సన్మానించారు.

ప్యాకేజీ 22తో కామారెడ్డి ప్రాంతానికి మేలు



దోమకొండలో సీఎం, మంత్రి ఉత్తమ్, షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దోమకొండ: ప్రాణహిత-చేవెళ్ల 22వ ప్యాకేజీతో కామారెడ్డి ప్రాంతానికి సాగు, తాగునీటి వసతి కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 22వ ప్యాకేజీ పనులకు నిధులు విడుదల చేసినందుకు సీఎం, రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డి గ్రామంలో...

కామారెడ్డి టౌన్: ప్రాణాహిత చేవెళ్ల ప్యాకేజీకి నిధులు మంజూరు చేసినందుకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దోమకొండలో ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దోమకొండ: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. పల్లకీసేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తీగల నాగభూషణంగౌడ్, ఉపాధ్యక్షులు నర్సాగౌడ్, కార్యదర్శి రవిగౌడ్, కోశాధికారి యాదగిరిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజనర్సాగౌడ్, ఉపాధ్యక్షులు కర్రోల్ల శ్యాంసుందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లిలో..



జంగంపల్లిలో మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ-జమదగ్ని మహర్షిల కల్యాణాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున ఒడి బియ్యం పోసి కట్నకానుకలను సమర్పించుకున్నారు. ఆలయంలో మహిళలు కుంకుమార్చన చేశారు.అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు రంగు హన్మగౌడ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సత్యసాయి సేవా సమితి నారాయణ సేవ

కామారెడి అర్బన్: శ్రీసత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం కామారెడ్డి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ప్రత్యేక నారాయణ సేవ అన్నదానం, మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు భాస్కర శర్మ, విఠల్, వెంకటేష్, సరస్వతి, శ్రీనివాస్, గంప మహేష్, గిరిజ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వాసవిమాత జన్మదిన వేడుకలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయలో అమ్మవారి జన్మదిన వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గోపూజ, అఖండ దీపారాధన, అమ్మవారికి అభిషేకాలు, కలశస్థాపన, అన్నపూజ, అగ్నిప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సామూహిక కలశాల ఊరేగింపు, ఆలయం నుంచి అమ్మవారి భారీ శోభాయాత్ర ఉంటుందని సంఘం పట్టణ అధ్యక్షుడు భూమేష్ తెలిపారు.

ఎల్లారెడ్డిలో నేడు కన్యకా పరమేశ్వరి జయంతి

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళాలు



విరాళం అందిస్తున్న దాత మల్లేశం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం మంగళవారం దాతలు కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. కామారెడ్డికి చెందిన ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశం రూ. 11,111, ఎర్రాపహడ్‌కు చెందిన కపిల్‌రెడ్డి రూ. 11,000, ఏనుగు నడిపి గంగారెడ్డి రూ. 11,000 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్, కోశాధికారి మారుతి, బాలయ్య, ఆదిరెడ్డి, సాయిలు, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో సీతానవమి వేడుకలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో సీతానవమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ నవమిని పురస్కరించుకుని సీతారాముల చిత్రపటాలకు పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బజరంగ్‌దళ్ నాయకులు మాట్లాడుతు సీతాదేవి సహనం, పవిత్రత, విధేయతకు మారుపేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నాయకుల ధర్నా



కామారెడ్డి టౌన్: ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ పౌర, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కు వినతిపత్రం అందజేశారు.నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీఎల్. నర్సింహారెడ్డి, క్యాతం సిద్దిరాములు, విజయరామరాజు, వీడీ దాసు, విఠల్, లచ్చన్న,బుల్లెట్, రమేష్, దేవులా, బాబారావు, లచ్చయ్య, దశరత్, బాలరాజు తదితరులున్నారు.

ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీ



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షం, వీచిన ఈదురు గాలులకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఐదుచెట్లు కూలిపోయాయి. అలాగే నేలకూలిన చెట్లు కిచెన్ షెడ్డుపై పడడంతో షెడ్డు ప్రహరీ ధ్వంసమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో రాజ్‌గంగారెడ్డి మంగళవారం పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం దశరథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

రేపు సలాబత్‌పూర్ ఆలయ భూముల కౌలు వేలం

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్‌లో ప్రసిద్ధి చెందిన హనుమాన్ ఆలయానికి చెందిన భూములకు ఈ నెల 8వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సోనాల శివారులో 34బైఈ సర్వే నెంబరులో 2 ఎకరాల భూమి ఆలయానికి చెందిందని ఒక సంవత్సరానికి కౌలు వేలంపాట నిర్వహిస్తామని ఆసక్తి గల వారు హనుమాన్ ఆలయానికి రావాలని ఆయన సూచించారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సునితా బండారి తెలిపారు. నాన్ మైనారిటీ ఐదో తరగతిలో అడ్మిషన్ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులకు బుధవారం లక్కీ డ్రా ఉందన్నారు. మైనారిటీలు ఈ నెల 30 వరకు అడ్మిషన్ల కోసం పాఠశాల సందర్శించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట, ఎల్లంపేట, బంజపల్లి గ్రామాలకు బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మాచారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు ఆయన వివరించారు.

జగన్నాథ్‌పల్లిలో పశువైద్య శిబిరం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామంలో బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాన్ని పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు నాగ్ నాథ్ పటేల్, సాయిని అశోక్, శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలి



నిజాంసాగర్(జుక్కల్): వన నర్సరీల నిర్వహణపై పంచాయతీల కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది దృష్టి సారించాలని మహమ్మద్ నగర్ మండల ప్రత్యేక అధికారిణి అరుణ అన్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండలం గున్కుల్ గ్రామ వన నర్సరీని మండల ప్రత్యేక అధికారిణి అరుణ, ఎంపీడీవో అనిత సందర్శించారు. వన నర్సరీలో చెట్ల పెంపకం తో పాటు నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. పంచాయతి కార్యదర్శి ప్రేమ్ సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899